క్లుప్తంగా

30 వరకు హాస్టళ్ల సందర్శన


మాట్లాడుతున్న నాగభూషణ్

నర్సీపట్నం:ప్రభుత్వ హాస్టల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు హాస్టళ్లను సందర్శించనున్నామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణ్,జిల్లా కార్యదర్శి ఫణీంద్ర తెలిపారు. శనివారం జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో వీరు మాట్లాడుతూ హాస్టళ్లలో సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. మూతపడిన హాస్టళ్లను వెంటనే తెరవాలని,శిథిలావస్థకు చేరిన వసతి గృహాలకు పక్కాభవనాలు నిర్మించాలని,విద్యార్థులకు ట్రంకుపెట్టెలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను చెల్లించాలని, కాస్మోటిక్స్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా అధ్యక్షుడు బాబ్జి,జగదీష్, తాతాజీ,సతీష్,సింహాద్రి, రవి పాల్గొన్నారు.

'లంపీ స్కిన్' నిరోధానికి ఉచితంగా టీకాలు


టీకాలు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న చిట్టినాయుడు

మాడుగుల: పశువుల్లో లంపీ స్కిన్ వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమాన్ని మండలంలో శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 18వ తేదీ వరకు కొనసాగుతుందని మాడుగుల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు వి.చిట్టినాయుడు తెలిపారు. మాడుగులలో నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మాడుగుల ఏరియా పశువైద్యశాల పరిధిలో చీడికాడ మండలంలో పశువులకు వేసేందుకు 5,000 డోసులు, మాడుగుల మండలంలో 7,300 డోసులను సిద్ధం చేసినట్టు చెప్పారు. పశువైద్య సహాయకుని సంప్రదించి నాలుగు నెలల వయస్సు దాటిన తెలుపు జాతి పశువులకు ఈ టీకాలు వేయించాలని సూచించారు.

సకాలంలో వైద్యసేవలందించాలి


వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు : ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యాధికారులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. స్థానిక సీహెచ్‌సీని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి, వైద్యుడు నందకిషోర్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు


పూడిక తీత పనులను పరిశీలిస్తున్న అధికారులు

మాకవరపాలెం: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని నర్సీపట్నం డీఎల్పీవో సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక రాజారావుపేటలోని చేపల మార్కెట్‌లోని డ్రైనేజీ పూడికతీత పనులను ఆయన శనివారం ఈవోపీఆర్డీతో సీతామహాలక్ష్మితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున ఎక్కడా చెత్తలేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. రాజారావుపేటలోని ఇళ్ల మధ్య నిర్వహిస్తున్న చేపల మార్కెట్ వల్ల దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయనకు తెలిపారు. దోమలు అధికమై ఫైలేరియా, ఇతర వ్యాధులకు గురవుతున్నామని, చేపల మార్కెట్‌ను నివాసాలకు దూరంగా మార్చు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన డీఎల్పీవో ఈమార్కెట్ మార్పునకు చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డీకి ఆదేశాలిచ్చారు. మార్కెట్‌ను శుభ్రం చేయడంలో నిర్లక్ష్యం చేయవద్దని కార్యదర్శి బాలదొరకు సూచించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
✆ 7997958337, 7075709854,
7997958336


రావణాపల్లి రిజర్వాయర్ వద్ద జోరుగా ప్రవహిస్తున్న వరద నీరు


కేజే పురం వద్ద పొంగి ప్రవహిస్తున్న తాచేరు నది


కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంబాబు


పొర్లు కట్టు మీద నుంచి పారుతున్న నర్సీపట్నం పెద్ద చెరువు నీరు

వదలని వానలు... పొంగిన వాగులు


శింగవరంలో నీట మునిగిన వరి ఆకు మడులు


కూలిన విద్యుత్ స్తంభం


శివపురం మెయిన్‌రోడ్డుపై ప్రవహిస్తున్న పంట పొలాల్లోని వర్షపు నీరు

నర్సీపట్నం: వాయుగుండం కారణంగా ఏకదాటిగా కురుస్తున్న వర్షాలతో వాగులు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. శనివారం కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, వివిధ పనుల మీద బయటకు వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో రావణాపల్లి రిజర్వాయర్ నీరు పొర్లు కట్టుమీద నుంచి పారుతోంది. నర్సీపట్నం పెద్ద చెరువు పూర్తిగా నిండడంతో పొర్లు కట్టు మీద నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. పెదబొడ్డేపల్లి చెరువు నీరు కోటవురట్లకు వెళ్లే మెయిన్ రోడ్డు మీదగా ప్రవహించింది. వాగులు పొంగి ప్రవహించడంతో పంట పొలాలు నీట మునిగాయి.

నర్సీపట్నం డివిజన్‌లో వర్షపాతం వివరాలు..

కోటవురట్ల మండలంలో 98.2 మిల్లీమీటర్ల అత్యధిక, ఎస్.రాయవరం మండలంలో 19.2 మిల్లీమీటర్ల అత్యల్ప వర్షపాతం నమోదయింది. నాతవరంలో 66.2 మిల్లీమీటర్లు, గొలుగొండలో 50.4, నర్సీపట్నంలో 85.6, రోలుగుంటలో 77.8, రావికమతంలో 92.6, మాడుగులలో 51.4 , చీడికాడలో 65.0, మాకవరపాలెంలో 85.2, నక్కపల్లిలో 51.2, పాయకరావుపేటలో 69.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

బుచ్చెయ్యపేట: మండలంలో శుక్రవారం 45 మిల్లీమీటర్లు, శనివారం 80.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గంటికొర్లాం,పీడీ పాలెం,లూలూరు, శింగవరం,లోపూడి తదితర గ్రామాల్లో వరి ఆకుమడులతో పాటు సరుగుడు,యూకలిప్టస్, వంగ,బీర,బెండ,టమాటా,మిరప తోటల్లోకి నీరు చేరడంతో రైతులకు నష్టం జరిగింది. పంట పొలాల నుంచి నీటిని బయటకు పంపేందుకు రైతులు చర్యలు చేపట్టారు.

కూలిన విద్యుత్ స్తంభాలు

దేవరాపల్లి: వర్షం ధాటికి చీడికాడ 33/11 కేవీ విద్యుత్ లైన్‌లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో తారువ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ అధికార్లు సరి చేసి విద్యుత్ సరఫరాను శనివారం పునరుద్ధరించారు. ఎం.అలమండ, వారాడ రోడ్డులో రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు స్పందించి కూలిన చెట్టును తొలగించారు.

జోరుగా వర్షాలు

మాడుగుల రూరల్: వాయుగుండం కారణంగా మండలంలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకు 51.4 మిల్లీమీటర్లు, గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 25.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు స్థానిక తహసీల్దారు టి.సత్యనారాయణ శనివారం తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆదివారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కలెక్టర్ ఆదేశాలతో ప్రభుత్వ అధికారులకు సెలవులు రద్దు చేసినట్టు చెప్పారు. ఇప్పటికే గ్రామాల్లో వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఏలను అందుబాటులో ఉంచామన్నారు. వర్షాలకు కొన్ని గ్రామాలల్లో వరినారు మడులు నీట మునిగాయని, చెరకు కార్సీ తోటలతో పాటు ఉద్యానవన పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని మండల వ్యవసాయశాఖాధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా తాచేరు, పాలగెడ్డ, శారదనదిలోకి భారీగా నీరు చేరింది.

గ్రామాలను సందర్శించిన ఎంపీడీవో

నాతవరం: మండలంలోని పలు గ్రామాలను శనివారం ఎంపీడీవో జాగరపు రాంబాబు సందర్శించి, వర్షాల కారణంగా నెలకొన్న సమస్యలను పరిశీలించారు. శృంగవరంలో కూలిన మాకిరెడ్డి లక్ష్మి ఇంటిని ఆయన పరిశీలించారు. మన్యపురట్లలో కుళాయిల నుంచి బురద నీరు వస్తోందని గ్రామస్తులు తెలియజేయడంతో రక్షిత నీటిని అందించాలని పంచాయతీ కార్యదర్శి సింహాద్రినాయుడును ఆయన అదేశించారు.

వెర్రిగెడ్డ నీరు ఉధృతి వల్ల ప్రమాదం పొంచి ఉండడంతో వై.బి.ఆగ్రహారాన్ని ఎంపీడీవో సందర్శించి, అక్కడ పరిస్థితులను సర్పంచ్ కోసూరి విజయను అడిగి తెలుసుకున్నారు. గెడ్డలో నీటి ఉధృతి పెరిగితే వాహనాలు రాకపోకలు నిలుపుదల చేయాలని సిబ్బందికి సూచించారు. గన్నవరం , వైబీ పట్నం గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు హుస్సేన్, సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి


వరి నారుమడిలో నీటిని రైతుచే బయటకు తీయిస్తున్న ఏడీఏ శ్రీదేవి


గొండుపాలెంలో వరినారు మడిని పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి సోమశేఖర్


బిళ్లలపాలెంలో వరినారు మడులను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ సహాయకులు అలేఖ్య

నర్సీపట్నం: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున నారుమడులు, పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులు సూచించారు. పలు గ్రామాల్లో నీట మునిగి నారుమడులను ఆయా ప్రాంతాల వ్యవసాయాధికారులు సందర్శించి రైతులకు సూచలు చేశారు. నర్సీపట్నం మండలం, గబ్బాడ రైతు సేవా కేంద్రం పరిధిలో గల వరి నారుమడులను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు టి.శ్రీదేవి పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు. విత్తనాలు చల్లిన పొలంలో మూడు రోజుల కన్నా ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. వీలైనంత వరకు నీటిని పూర్తిగా బయటకు తీసివేయాలని సూచించారు. దీని వల్ల విత్తనం గాలి పోసుకుని త్వరగా మొలక వస్తుంది, పూర్తిగా నీట మునిగితే మళ్లీ విత్తనాలు చల్లుకోవాల్సి ఉంటుందన్నారు. నెల రోజుల వ్యవధిలోపు ఉన్న నారుమళ్లలో నీరు బయటకు తీసేసి, ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏవో అప్పారావు, సిబ్బంది ఉన్నారు.

కె. కోటపాడు: మండలంలోని కె. కోటపాడు, గొండుపాలెం, గరుగుబిల్లి, వారాడ, సింగన్నదొరపాలెం, ఎ.కోడూరు, కింతాడ, వి.సంతపాలెం, రొంగలినాయుడుపాలెం, ఆర్.వై.అగ్రహారం తదితర గ్రామాల్లో గల వరినారు మడులను మండల వ్యవసాయాధికారి శనివారం పరిశీలించారు. తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. ఏఈవో లైలాదేవి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: వర్షాల కారణంగా ముంపునకు గురై వరి నారు మడులను శనివారం మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు, ఉద్యానవన సహాయకులు అలేఖ్య, వ్యవసాయ సహాయకులు పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు.

కేజే పురంలో మోదకొండమ్మ పండగ చాటింపు

మాడుగుల రూరల్: మండలంలోని కేజే పురంలో మోదకొండమ్మ పండగ నిర్వహణకు సంబంధించి శనివారం రాత్రి చాటింపు వేశారు. వచ్చే నెల 4 వ తేదీ ఆదివారం పండగ నిర్వహించడానికి నిర్ణయించినట్టు చాటింపులో తెలిపారు. ఈ నెల 28 వ తేదీ నుంచి అమ్మవారి ఘటాలు గ్రామంలో తిరగడం ప్రారంభంకానున్నాయని మోదమాంబ ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.

విద్యుత్‌శాఖకు ఎటువంటి నష్టం జరగలేదు

చోడవరం రూరల్: ఈదురుగాలులు వీస్తూ, జోరుగా వర్షాలు కురుస్తున్నప్పటికీ విద్యుత్‌శాఖకు ఎటువంటి నష్టం కలగలేదని, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని డీఈఈ ఉప్పలూరి కుమార్ గౌరీప్రసాద్ తెలిపారు. ఈ ఆరు రోజుల వ్యవధిలో మొత్తం మీద 12 సెంటీమీటర్ల మేరకు వర్షపాతం నమోదయినప్పటికీ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయేంతగా తమ శాఖకు నష్టం వాటిల్లక పోవడంతో విద్యుత్ వినియోగదారులకు అసౌకర్యం కలగలేదన్నారు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలకు నష్టం జరగలేదని ఆయన చెప్పారు.

'కోనాం'లో పెరిగిన నీటిమట్టం


కోనాం జలాశయం

చీడికాడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని కోనాం జలాశయం నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 400 క్యూసెక్కులు ఉండడంతో శనివారం ఉదయానికి జలాశయం నీటి మట్టం 98.60 మీటర్లకు చేరినట్టు ఇరిగేషన్ ఏఈ జయరాం తెలిపారు.జలాశయం ప్రమాదస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుత నీటి మట్టం 98.60మీటర్లు ఉంది. ప్రస్తుత ఇన్‌ఫ్లో ప్రకారం మరో రెండు రోజుల్లో జలాశయం నీటి మట్టం 100 మీటర్లు దాటే అవకాశం ఉంది. 40 క్యూసెక్కుల నీటికి కిందకు విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటిమట్టం పెరుగుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చోడవరం రూరల్: పట్టణ పరిధిలోని అన్నవరంలో ఆదివారం సద్భావ టీమ్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. రాయాలయం దరి కమ్యూనిటీ హాల్‌లో ఉదయం పది గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని సీడీవీఎం కమ్యూనిటీ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఇతర వివరాలకు 7842799881, 3581351851 అనే నంబర్లలో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో వెంకన్న గిరి ప్రదక్షిణ

- గోవింద నామ స్మరణంతో మార్మోగిన మారేపల్లి పరిసరాలు


ఎం. కోడూరులో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు


మారేపల్లి వేంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లిలో ఉత్తర వాహిని శారదానది తీరాన వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణను శనివారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వాక ముత్యాలమ్మ తల్లి జంక్షన్ నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ వెంకటరాజుపురం, తెనుగుపూడి, భీమలింగేశ్వర స్వామి ఆలయం, మారేపల్లి బీసీ కాలనీ మీదుగా పాండవుల మెట్ట స్వామి వారి ఆలయం వరకు సాగింది. సుమారు ఏడు కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు దారి పొడవున పలువురు స్థానిక ప్రజలు, దాతలు ప్రసాదం, పండ్లు, మంచినీటి ప్యాకెట్లను వితరణగా అందజేశారు.ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, పలువురు నాయకులు వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

16 ఆలయాల చుట్టూ ...

మాడుగుల రూరల్: గురు పౌర్ణమి సందర్భంగా ఎం.కోడూరులో శనివారం 16 దేవాలయాల చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త గొల్లవిల్లి సత్యారావు ఆధ్వర్యంలో సుమారు 300 మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమరసత ఫౌండేషన్ ప్రచారక్ తవ్వా సన్యాసిశెట్టి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎం.కోడూరు తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథస్వామి పండగ


చొడువాడలో నీటిని తీసుకువెళ్తున్న భక్తులు

కె.కోటపాడు/మాడుగుల రూరల్: జగన్నాథ స్వామి పండగను కె.కోటపాడు మండలం చొడువాడ, మాడుగుల మండలం కేజే పురంలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు అండీలతో నీటిని ఇళ్లకు తీసుకు వెళ్లి జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఏటా తిరుగు రథ యాత్ర అనంతరం వచ్చే శనివారం నాడు ఈ పండగను నిర్వహిస్తారు. కేజేపురంలో మహిళలు, యువకులు అండీలు పట్టుకుని మేళతాళాలతో తాచేరు నదికి వెళ్లి వాటిలో నీటిని నింపుకొని ఇంటికి తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బంధు మిత్రులతో సహపంక్తి భోజనాలు చేశారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని విజయరామరాజుపేటలో జగన్నాథస్వామి పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామస్తులంతా కలిసి నీటి కుండలు, డప్పులు, ఇతర వాయిద్యాలతో జగన్నాథస్వామి సంబరంలో పాల్గొన్నారు.

గురు పౌర్ణమికి ఆలయాలు ముస్తాబు


వెంకన్నపాలెం సాయిబాబా ఆలయం

చోడవరం: మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయాలతోపాటు శ్రీస్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. వెంకన్నపాలెం, చోడవరం పట్టణంలలో గల షిర్డీ సాయిబాబా ఆలయాల్లో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

మాడుగుల రూరల్: గురు పౌర్ణమి సందర్భంగా కేజే పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని షిర్డీ సాయినాథునికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు ఓ ప్రకటనలో తెలిపారు. మృత్యుంజయ హోమం, సాయి వ్రతాలు, అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

బదిలీ అయిన తహసీల్దార్లకు ఘన సన్మానం


తహసీల్దార్ శ్రీరాములను సత్కరిస్తున్న ఆర్డీవో జయరాం, రెవెన్యూ సిబ్బంది

నర్సీపట్నం: సొంత జిల్లాకు బదిలీ అయిన తహసీల్దార్లకు ఆర్డీవో హెచ్.వి.జయరాం, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. నర్సీపట్నం నియోజకవర్గం నుంచి బదిలీపై వెళ్తున్న నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం మండలాల తహసీల్దార్లు శ్రీరాములు, రమేష్ కుమార్, మురళీమోహన్‌కు శనివారం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో సన్మానించారు. సార్వత్రి ఎన్నికల్లో విశేష సేవలు అందించి నియోజకవర్గానికి పేరుతెచ్చిన తహసీల్దార్లు శ్రీరాములు, రమేష్ కుమార్, మురళీమోహన్‌లను ఆర్డీవో, రెవెన్యూ సిబ్బంది జ్ఞాపికను అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకట రమణ తహసీల్దార్ శ్రీరాములకు జ్ఞాపిక అందజేసి, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అసిస్టెంట్ ఆర్వోగా శ్రీరాములు సమర్థంగా పని చేశారని, శ్రీరాముల వల్లే ఎలాంటి అపోహలకు తోవలేకుండా ఎన్నికలు నిర్వహించామన్నారు. మిగిలిన తహసీల్దార్లు కూడా వారి విధులను సక్రమంగా నిర్వర్తించారన్నారు. ఆర్డీవో జయరాం దగ్గర పని చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తహసీల్దార్లు పేర్కొన్నారు.

రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించాలి


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు


చీడికాడలో వినతి పత్రం అందజేస్తున్న వివిధ సంఘాల నేతలు

కె.కోటపాడు: రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించాలని, కూటమి నేతలు హామీ ఇచ్చిన మేరకు రూ.20 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం మండలంలో పలు సచివాలయాల కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు కార్డులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలని చొడువాడ,గుల్లేపల్లి,గొండుపాలెం,కె.కోటపాడు, ఎ.కోడూరు,వారాడ,సంతపాలెం సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేసినట్టు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గండి నాయన్‌బాబు, నాయకులు యర్రా దేముడు, ఈర్లె నాయుడు బాబు, ఓనం సూర్యనారాయణ తదితరులు తెలిపారు.

చీడికాడ: రైతు,కౌలురైతు,వ్యవసాయ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పలు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను సీఐటీయూ మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు,రైతు సంఘం నేత బి.రమేష్,మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు బి.మహాలక్ష్మమ్మ శనివారం సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదు


అలమండ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పలరాజు

దేవరాపల్లి: గ్రామ స్థాయిలో అధికారులు విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని దేవరాపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్. అప్పలరాజు హెచ్చరించారు. ఎం.అలమండ గ్రామ సచివాలయాన్ని ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ జి.సంతోషి నళినితో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో రికార్డులను పరిశీలించి, అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక పంచాయతీ సెక్రటరీ ప్రసాద్‌కు సూచించారు.అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా ? లేదా ? అని పిల్లలతో పాటు అక్కడ ఉన్న తల్లులను అడిగి తెలుసుకున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ పరిశీలించి ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో
మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com